సేనాధిపతికి దళిత సేవా రత్న అవార్డు



అవార్డును అందుకుంటున్న సేనాధిపతి

ఉస్మానియాయూనివర్సిటీ: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి 20ఏళ్లుగా పనిచేస్తున్న సరిగోమ్ముల సేనాధిపతి దళిత సేవారత్న అవార్డు అందుకున్నారు. ఓయూ క్యాంపస్‌ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన సేనాధిపతి దళితుల్లో చైతన్యం, వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి దళితులకు ప్రభుత్వం నుంచి లభించే పథకాలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గకరణ కోసం దండోర ఉద్యమం, ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర డా.బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌ ఇటుక రాజు మాదిగ దళిత సేవారత్న అవార్డును సేనాధిపతికి అందజేశారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



మురుగు పారే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీఎం వినోద్‌ తదితరులు

పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ గొల్లకొమురయ్య కాలనీ రోడ్డులో సోమవారం జలమండలి జీఎం వినోద్‌, డీజీఎం ఆశీష్‌, మేనేజర్‌ సలీం, శివశంకర్‌ తదితరులు పర్యటించారు. చాలా రోజుల నుంచి గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌ ముందు రోడ్డులో మురుగు పారుతోంది. అయితే ఈ సమస్యపై ఆయా పార్టీల నాయకులు, స్థానికులు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. ఈ విషయమై సాక్షిలో 'మురుగు ముంచెత్తుతున్నా పట్టదా..?' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన జీఎం వినోద్‌ మురుగు పారుతున్న ప్రాంతాన్ని సందర్శించి సిబ్బందితో కలిసి పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ జీఎం ఆశీష్‌, మేనేజర్‌ సలీంను ఆదేశించారు. ఈ మేరకు డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, ఏఈ చైతన్య నూతన పైపులైన్‌ ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు వెంకటేషన్‌ రాజు, బీజేపీ అధ్యక్షుడు రామంచి మహేష్‌, గొల్లకొమురయ్య కాలనీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

'గాంధీ' నుంచి రోగి సహాయకుడి అదృశ్యం



విస్లావత్‌ రాజు

గాంధీఆస్పత్రి: రోగి సహాయకుడు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లితండాకు చెందిన విస్లావత్‌ రాజు(40) వనిత భార్యభర్తలు. గర్భవతి అయిన వనిత అస్వస్థతకు గురికాగా నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మరింత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి రెఫర్‌ చేయగా గతనెల 25న వనితను గాంధీ ఫిమేల్‌వార్డులో చేర్పించగా, భర్త రాజు వెయిటింగ్‌ హాలులో ఉంటున్నాడు. రాజుకు ప్రతిరోజూ కల్లు తాగే అలవాటు ఉంది. మూడు రోజుల పాటు కల్లు తాగకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి పిచ్చిగా ప్రవర్తించసాగాడు. గతనెల 28వ తేదీన రాజు గాంధీ వెయిటింగ్‌ హాలు నుంచి అదృశ్యమయ్యాడు. పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో గాలించినా ఫలితం లేకపోవడంతో సోదరుడు విస్లావత్‌ రెడ్యా సోమవారం పోలీసులను ఆశ్రయించగా, మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్‌ నారాయణ వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన దూదిమెట్ల మల్లికార్జున్‌(63) ఆటో డ్రైవర్‌. మద్యానికి బానిసైన ఇతడు ఇంట్లో డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్‌ – చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య యమ్నంపేట బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

స్ఫూర్తి అడుగులు.. సౌర వెలుగులు

విద్యార్థులు చెల్లించిన ట్యూషన్‌ ఫీజుతోనే..



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోలార్‌ వ్యవస్థ

సనత్‌నగర్‌: అది సర్కార్‌ కళాశాల.. వచ్చామా విధులు నిర్వర్తించామా.. ఇంటికి వెళ్లిపోయామా..? అన్నదే సాధారణంగా ఉద్యోగుల మదిలో ఉండే ఆలోచన. కానీ అక్కడి సిబ్బంది కళాశాలకు అయ్యే ఖర్చులను తగ్గించి ఒక మహాయజ్ఞాన్ని పూర్తి చేశారు. ఎవరో దాత వస్తారనో.. లేక ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందనో.. ప్రజాప్రతినిధులు ఫండ్స్‌ ఇస్తారనో వేచి చూడలేదు. విద్యార్థులు నామమాత్రంగా చెల్లించే ట్యూషన్‌ ఫీజు నుంచే మెయింటెనెన్స్‌ చూసుకుంటూనే అనవసర ఖర్చులు తగ్గించి పొదుపు చేశారు. అలా ఏడాది.. రెండేళ్లు కాదు.. దాదాపు పదేళ్ల పాటు మిగిల్చిన ఫండ్స్‌తో 'సౌర' వెలుగుల కోసం ఖర్చు చేశారు. ఇదీ బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఘనత.

- దాదాపు పదేళ్ల పాటు డబ్బులు మిగిల్చి..
- బేగంపేట మహిళా కళాశాలలో సౌర పలకల ఏర్పాటు
- 80 కిలోవాట్స్‌ విద్యుత్‌ సరఫరాకు సిద్ధం
- రేపు ప్రారంభించనున్న కళాశాల విద్యాశాఖ కమిషనర్‌

80 కిలోవాట్స్‌ సామర్థ్యంతో..

ఏడాది క్రితం వరకు కళాశాల అదనపు గదులు చాలా అవసరం. అప్పటివరకు కొనసాగుతున్న తరగతి గదుల పైఅంతస్తులో అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని తలంచారు. అయితే ఆ గదుల నిర్మాణంతో పాటే సోలార్‌ పలకలను రూఫ్‌గా చేసి కరెంటును ఉపయోగించుకోవచ్చనే ఆలోచన వచ్చింది. దాంతో రూ.2.40 కోట్ల వ్యయంతో అదనపు గదుల నిర్మాణంతో పాటు 80 కిలోవాట్స్‌ సామర్థ్యం కలిగిన సోలార్‌ రూఫ్‌ నిర్మాణం పూర్తి చేశారు. అయితే కరెంటు బిల్లులను మిగిల్చేందుకు అధికారికంగా ప్రారంభించకపోయినా కొంతకాలంగా 40 కిలోవాట్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇక నుంచి మొత్తం 80 కిలోవాట్స్‌ను ఉపయోగించుకుని జీరో కరెంటు బిల్లు పొందే దిశగా సిద్ధమయ్యారు.

స్ఫూర్తిదాయకంగా..

ఎలాంటి ఫండ్స్‌పై ఆధారపడకుండా విద్యార్థులు చెల్లించిన చిన్న చిన్న మొత్తాల్లో నుంచి దాదాపు పదేళ్లుగా పొదుపు చేయగా మిగిలిన ఆక్యుమిలేటెడ్‌ ఫండ్స్‌తోనే సోలార్‌ రూఫ్‌తో కూడిన అదనపు తరగతి గదులను నిర్మించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. బయట కరెంటుపై ఆధారపడకుండా కేవలం సౌర విద్యుత్‌ పైనే కళాశాలకు సంబంధించి విద్యుత్‌ ఆధారిత పనులను కొనసాగించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే 40 కిలోవాట్స్‌ను వినియోగించుకుంటుండగా, మరో 40 కిలోవాట్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చి కళాశాల అన్ని భవనాల్లో సోలార్‌ వెలుగులు ప్రసరింపజేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం 80 కిలోవాట్స్‌ సామర్థ్యం కలిగిన సోలార్‌ వ్యవస్థను ఈ నెల 6వ తేదీన కాలేజియేట్‌ ఎడ్యుకేషన్‌ కమిషనర్‌ దేవసేన అధికారికంగా ప్రారంభించనున్నారు.

దాదాపు రూ.80 వేల కరెంటు బిల్లు ఆదా..

సాధారణంగా కళాశాల అంటే కరెంటు ఆధారిత ప్రయోగశాలలు, కంప్యూటర్‌ ల్యాబ్స్‌, లిఫ్టులు, లైటింగ్‌ వ్యవస్థ, ఎలక్ట్రానిక్‌ వస్తువుల వినియోగం.. ఇలా రకరకాల ఉపయోగాలు ఉంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నెలకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు కరెంటు బిల్లు వస్తుండేవి. ఇది కాస్తా కళాశాలకు భారంగా ఉండేది. కానీ ఇప్పుడు సోలార్‌ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఆ బిల్లుల మోత నుంచి కళాశాలకు విముక్తి కలిగిందనే చెప్పాలి.



కుమ్మేసింది.. ముంచేసింది..

అప్పటి వరకు ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణం సోమవారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. వర్షం కుండపోతలా మొదలైంది. ఓ గంట తర్వాత అమీర్‌పేట్‌ ప్రాంతం చెరువులా మారిపోయింది. కాలనీలను వరద ముంచెత్తింది. ఎక్కడికక్కడ సెల్లార్లలో నీళ్లు నిండిపోయాయి. ద్విచక్ర వాహనాలు మునిగిపోయాయి. ట్రాఫిక్‌ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సనత్‌నగర్‌, బేగంపేట్‌ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. – సనత్‌నగర్‌



అమీర్‌పేటలో.. దృశ్యాలు









ముర్రుపాలలో ఎన్నో పోషక విలువలు



తల్లులకు పోషకాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

బన్సీలాల్‌పేట్‌: తల్లిపాలు చిన్నారులకు ఎంతో శ్రేయస్కరమని, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంచుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. బోయిగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ జి.అనిల్‌కుమార్‌, యునాని వైద్యాధికారి డాక్టర్‌ ఎంఏ.అజీజ్‌, నర్సింగ్‌ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ సీహెచ్‌ రోజారాణి తదితరులు మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపే ఇచ్చే ముర్రుపాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయన్నారు. తల్లిపాలు తాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో మహిళలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య సేవలు లభిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌ విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ చక్కటి నృత్యం, నాటక ప్రదర్శన ఇచ్చారు. అనంతరం తల్లులకు పోషకాహార ప్యాకెట్లను అందజేశారు. పీహెచ్‌ఎన్‌ ఉమా, నర్సింగ్‌ కళాశాల సహాయ ప్రొఫెసర్లు ఎలిజబెత్‌ అనిత, సత్యప్రియ, అధ్యాపకులు గిరిజాకుమారి, పరంజ్యోతి, చరిత, చంద్రకళ, మంజుల, నర్సింగ్‌ ఆఫీసర్‌ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

యువత ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు

పద్మారావునగర్‌: కేంద్ర ప్రభుత్వ పథకాలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కార్పొరేటర్‌ చీర సుచిత్రశ్రీకాంత్‌ అన్నారు. సికింద్రాబాద్‌ బోట్స్‌ క్లబ్‌ యూత్‌ హాస్టల్‌ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ ఆన్‌ గవర్నమెంట్‌ ఫ్లాగ్‌షిప్‌ స్కీమ్‌ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతీ, యువకుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోందని చెప్పారు. స్కిల్‌ ఇండియా, డిజిటల్‌ ఇండియా, అయుష్మాన్‌ భారత్‌ వంటి అనేక కార్యక్రమాలను కేంద్రం అమలు చేస్తోందని వివరించారు. విద్యాభివృద్ధితోనే యువత జీవితాలు బంగారుమయం అవుతాయన్నారు. చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అలవర్చుకోవాలన్నారు. సెట్విన్‌ ఎండీ వేణుగోపాల్‌ మాట్లాడుతూ యువత కోసం సెట్విన్‌ అనేక కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తోందని చెప్పారు. డాక్టర్‌ విజేందర్‌ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయుష్మాన్‌భారత్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. రామ్‌మోహన్‌ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా లభించే స్కీమ్స్‌ గురించి తెలిపారు. అనంతరం యూత్‌ హాస్టల్‌ ప్రాంగణంలో కార్పొరేటర్‌ చీర సుచిత్రశ్రీకాంత్‌ మొక్కను నాటారు.



వర్క్‌షాప్‌లో కార్పొరేటర్‌ చీర సుచిత్రశ్రీకాంత్‌, సెట్విన్‌ ఎండీ వేణుగోపాల్‌

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌: మాజీమంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించి మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. దాసారం బస్తీ మాజీ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్‌ఎస్‌ నాయకుడు కుమార్‌ సోదరుడు సతీష్‌లు ఆదివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ వారి వారి నివాసాలకు వెళ్లి పార్థివ దేహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్‌ శేషుకుమారి, బీఆర్‌ఎస్‌ నాయకులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, అశోక్‌యాదవ్‌, కూతురు నర్సింహ, కట్ట బలరాం, వనం శ్రీనివాస్‌, కొలను భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలన సులభమే..



సమావేశంలో కార్పొరేటర్‌ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్‌: వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం చేయవద్దని మోండా కార్పొరేటర్‌ కొంతం దీపిక అన్నారు. శివాజీనగర్‌ బస్తీ దవాఖాలాలో జన ఆరోగ్య సమితి పేరిట సోమవారం నిర్వహించిన వైద్య సిబ్బంది సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజాన్ని పీడిస్తున్న టీబీ వ్యాధి నిర్మూలన సులభమే అన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ అవగాహన పెంచుకుంటే వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్య సమస్యలు, వాటి సంక్రమణ, నివారణ చర్యలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ తరచూ శిబిరాలు, అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ శ్రీకాంత్‌ పలువురు వైద్యాధికారులు, స్టాఫ్‌ నర్సులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్‌: రాంగోపాల్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన లెటర్‌ను కార్పొరేటర్‌ చీర సుచిత్ర శ్రీకాంత్‌ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆర్‌వీ కర్ణన్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ సుచిత్ర శ్రీకాంత్‌ మాట్లాడుతూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు విక్టోరియా గంజ్‌ కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాల కల్పించాలని కోరామన్నారు. కర్బలామైదాన్‌ నుంచి విక్టోరియా గంజ్‌ వరకు, జీరా స్ట్రీట్‌ నంబర్‌–3, రోడ్‌ నంబర్‌–2, ఆర్‌పీ రోడ్‌లోని రహదారుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరినట్లు చెప్పారు. చుట్టల బస్తీ, ముక్లడ్‌గూడ రోడ్లలో సీసీ రోడ్లు, సీవరేజీ పైపులైన్ల పునరుద్ధరణతో పాటు విక్టోరియా గంజ్‌ కమ్యూనిటీ హాల్‌లో పబ్లింగ్‌, కరెంట్‌ వైరింగ్‌ వంటి పనులను తక్షణమే చేపట్టాని కోరామన్నారు.

ఈ ఏడాది మెండుగా వర్షాలు కురిపిస్తా..

- అన్నానగర్‌ పోచమ్మ ఆలయంలో రంగం
- భవిష్యవాణి వినిపించిన మాతంగి శోభరాణి

రసూల్‌పురా: శ్రావణమాస బోనాల జాతరలో భాగంగా సోమవారం అన్నానగర్‌ పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగం కార్యక్రమం నిర్వహించారు. మారేడుపల్లికి చెందిన మాతంగి శోభరాణి పచ్చికుండపై నిల్చొని భవిష్యవాణి చెప్పింది. 'నన్ను భక్తిశ్రద్ధలతో కొలిస్తే నేను నా భక్తులను కాపాడుకుంటా.. నా గుడికి ధ్వజస్తంభం ఏర్పాటు చేయండి.. ఈ ఏడాది మెండుగా వర్షాలు కురిపిస్తా.. దుష్టశక్తుల నుంచి మిమ్మల్ని రక్షిస్తా.. నాకు సమర్పించిన బోనాలు, మొక్కులతో సంతోషంచాను' అని భవిష్యవాణి తెలిపింది. ఎయిర్‌పోర్టు అధికారులు పేదల ఇళ్లను తొలగిస్తారని ప్రచారం జరుగుతోందని, మా ఇళ్లు కూలగొడతారా అని భక్తులు అడిగిన ప్రశ్నకు మాతంగి ఎలాంటి అనర్థం జరగకుండా కాపాడతానని పలికింది. అదే విధంగా అన్నానగర్‌ బస్తీ నుంచి పోతరాజుల నృత్యాలతో, బ్యాండ్‌ మేళాలతో, తీన్మార్‌ డాన్సులు చేస్తూ సుందరంగా రంగురంగుల పుష్పాలతో అలంకరించి ఆలయం వరకు ఫలహారబండ్ల ఊరేగింపు చేపట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అడ్డగుట్ట: బోనాల పండగను పురస్కరించుకొని అడ్డగుట్ట కార్పొరేటర్‌ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్‌ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. డివిజన్‌ పరిధిలోని ఇందిరానగర్‌ సి కాలనీ, మరాఠాబస్తీ, అడ్డగుట్ట సి, డి సెక్షన్‌, రైల్వే క్వార్టర్స్‌, కమ్యూనిటీ హాల్‌ ప్రాంతాల్లో ఆమె అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు లింగాని శ్రీనివాస్‌, నక్క మధు, శ్రీనివాస్‌ గౌడ్‌, దాసరి శ్రీనివాస్‌, అమర్‌, రమేష్‌, మహేందర్‌, మల్లేష్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

రసూల్‌పురా: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వరద నీటి కాల్వ పనులను సకాలంలో పూర్తి చేయాలని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మోండా డివిజన్‌ అంబేడ్కర్‌నగర్‌లో సోమవారం పర్యటించి రూ.32 లక్షలతో చేపడుతున్న స్ట్రామ్‌వాటర్‌ డ్రైన్‌ పనులను శ్రీగణేష్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఉధ్రుతంగా వచ్చి లోతట్టు ప్రాంతమైన అంబేడ్కర్‌నగర్‌లోని ఇళ్లలోకి చేరేదని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సమస్యపై దృష్టి సారించి జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. స్థానిక నాయకులు సంతోష్‌యాదవ్‌, నర్సింగ్‌రావు, నాగేష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌

వ్యాపారంలో నష్టం పూడ్చేందుకు దోపిడీ



వివరాలు వెల్లడిస్తున్న చిలకలగూడ డీఐ రమేష్‌గౌడ్‌(వృత్తంలో నిందితుడు)

- ఇంటి ఎదురుగా ఉన్న వృద్ధురాలే టార్గెట్‌
- ఇంటర్నెట్‌ కనెక్షన్‌ అంటూ ఇంట్లోకి ప్రవేశం
- 5 తులాల ఆభరణాలతో పరార్‌
- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్‌, ఆభరణాల స్వాధీనం

చిలకలగూడ: వ్యాపారంలో వచ్చిన నష్టాన్ని దోపిడీ చేసి భర్తీ చేయాలనుకున్నాడు. రెక్కీ నిర్వహించి తన ఇంటి ఎదురుగా ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలిని టార్గెట్‌ చేశాడు. ముఖానికి హెల్మెట్‌ ధరించి వృద్ధురాలిని బెదిరించి ఆమె ఒంటిపై ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలను దోపిడీ చేసి పోలీసులకు చిక్కి ఊచలు లెక్కిస్తున్నాడు. చిలకలగూడ డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి మేడిబావి గౌరీసత్య మల్లిఖార్జున నివాస్‌ అపార్ట్‌మెంట్‌లో ఫస్ట్‌ఫ్లోర్‌లో సత్తెమ్మ(89) ఒంటరిగా నివసిస్తోంది. అదే అపార్ట్‌మెంట్‌లో సత్తెమ్మ ఇంటి ఎదురుగా గిట్టవేణి రాము(49) కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. పార్శిగుట్ట మొరంబండ ప్రాంతంలో డీటీడీసీ కొరియర్‌ బ్రాంచ్‌ నిర్వహిస్తున్న రాము ప్రైవేటు చిట్టీల వ్యాపారంలో నష్టపోయి అప్పుల పాలై మద్యానికి బానిసయ్యాడు. చోరీలు, దోపిడీలు చేసి వ్యాపారంలో వచ్చిన నష్టాన్ని భర్తీ చేయాలని పథకం వేశాడు. తన ఫ్లాట్‌ ఎదురు ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న సత్తెమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలపై కన్ను పడింది. ఈ నెల 2వ తేదీన ఉదయం ముఖం కనిపించకుండా హెల్మెట్‌ ధరించి సత్తెమ్మ ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంటర్‌నెట్‌ కనెక్షన్‌ రిపేరు చేసేందుకు వచ్చానని నమ్మించాడు. లేడీ కేర్‌ టేకర్‌ ప్రసన్న ఇంకో గదిలో ఉండటాన్ని గమనించి ఆ గదికి బయట నుంచి గడియ పెట్టాడు. మంచంపై పడుకున్న సత్తెమ్మను బెదిరించి, కొట్టి ఆమె ఒంటిపై ఉన్న ఐదు తులాల బంగారు నగలు తెంపుకుని పరారయ్యాడు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ డివైజ్‌ను తనవెంట తీసుకువెళ్లాడు. కొంత సమయం తర్వాత కారు డ్రైవర్‌ నాగరాజు వచ్చి చూడగా భయంతో వణుకుతున్న సత్తెమ్మతో మాట్లాడి విషయం తెలుసుకున్నాడు. వెంటనే డయల్‌ 100కు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సేకరించి గిట్టవేణి రామును ఈ నెల 3వ తేదీన అదుపులోకి తీసుకుని ఐదు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. దోపిడీని 24 గంటల వ్యవధిలో ఛేదించిన చిలకలగూడ పోలీసులను ఈస్ట్‌జోన్‌ డీసీపీ బాలస్వామి, అడిషనల్‌ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి అభినందించారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్‌, డీఐ రమేష్‌గౌడ్‌, డీఎస్‌ఐ రాకేష్‌, కానిస్టేబుళ్లు జగదీష్‌, షేక్‌మజర్‌బాషా, నవీన్‌, గణేష్‌, వినయ్‌, కృష్ణకు రివార్డులు అందజేశారు.